బీసీ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్‌గా గుజ్జ సత్యం


ఆర్. కృష్ణయ్యచే నియామకపత్రం అందుకుంటున్న బీసీ జేఏసీ రాష్ట్ర కోఆర్డినేటర్ గుజ్జ సత్యం

బర్కత్‌పుర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బీసీ 42శాతం రిజర్వేషన్ల సాధనకై ఎంపీ ఆర్. కృష్ణయ్య సారథ్యంలో ఏర్పడిన బీసీ జేఏసీకి నూతన రాష్ట్ర కోఆర్డినేటర్‌గా బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం నియమితులయ్యారు. ఈ మేరకు గుజ్జ సత్యంకు జేఏసీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య గురువారం నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాచిగూడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గుజ్జ సత్యం మాట్లాడుతూ 42 శాతం బీసీ రిజర్వేషన్లను సాధించే వరకు ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి అఖిలపక్ష బృందాన్ని బీసీ సంఘాలు, ప్రజా సంఘాలను ఢిల్లీకి తీసుకెళ్లి మోదీ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తీసుకురావాలని ఆయన కోరారు. పార్లమెంటులో బీసీ బిల్లుపెట్టి ఆమోదించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని ఆయన డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ల సాధనే లక్ష్యంగా అన్ని పక్షాలను కలుపుకొని ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని మిలియన్‌మార్చ్ తరహాలో ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తామని ఆయన అన్నారు. కోఆర్డినేటర్‌గా నియమించినందుకు ఆర్. కృష్ణయ్యకు కృతజ్ఞతలు తెలిపారు.

పీడీఎస్‌యూ 23వ మహాసభల పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రాకేష్, హరీష్ తదితరులు

నల్లకుంట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నవంబర్ 3న జరగనున్న పీడీఎస్‌యూ గ్రేటర్ హైదరాబాద్ 23వ జిల్లా మహాసభలకు సంబంధించిన పోస్టర్‌ను సంఘం నాయకులు గురువారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సోనబోయిన రాకేష్, కార్యదర్శి హరీష్‌లు మాట్లాడుతూ మహాసభలు 3న ఉదయం 10గంటలకు విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో ప్రారంభం కానున్నట్లు తెలిపారు. ఈ మహాసభల ప్రారంభోపన్యాసంలో ఓయూ ఆర్ట్స్ కాలేజీ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ కొండ నాగేశ్వరరావు వక్తగా, సీపీఐ(ఎంఎల్) నాయకులు ఎం.హన్మేష్, ఎస్.ఎల్.పద్మ, పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకులు బి.ప్రదీప్ హాజరవుతారని అన్నారు. కార్యక్రమంలో నాయకులు దీక్షిత, శివ, వినోద్‌బాబు, భాను, రాజు తదితరులు పాల్గొన్నారు.

జూబ్లీహిల్స్‌లో బీజేపీ విజయం ఖాయం


ప్రచారం చేస్తున్న జవహర్‌పురి నందు తదితరులు

ముషీరాబాద్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో బీజేపీ ఘన విజయం సాధించడం ఖాయమని ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జవహర్‌పురి నందు దీమా వ్యక్తం చేశారు. గురువారం బీజేపీ అభ్యర్థి దీపక్‌రెడ్డికి మద్దతుగా ముషీరాబాద్ నుంచి ఆ పార్టీ నాయకులు తరలివెళ్లి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తూ పార్టీకి ఓటు వేయాలని జవహర్‌పురి నందు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజల మద్దతు బీజేపీకే లభిస్తున్నదని అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయఢంకా మోగిస్తున్నదని దీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమేష్, ఆయాష్, బాలకృష్ణ, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మొంథా తుఫాన్ బాధితులను ఆదుకోవాలి

చిక్కడపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ వల్ల తీవ్రంగా నష్టపోతున్న రైతాంగానికి సహాయక చర్యలు చేపట్టాలని టీపీసీ నగర ప్రధాన కార్యదర్శి, మాజీ కార్పొరేటర్ వలుస బాలరాజ్‌గౌడ్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సాయంత్రం చిక్కడపల్లిలో విలేకరులతో ఆయన మాట్లాడారు. తుఫాన్ ప్రభావంతో ఐదేపల కురిసిన వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని వెంటనే ప్రభుత్వం ఆదుకోవాలని ఆయన అన్నారు. తుఫాన్ ప్రభావంతో వీస్తున్న గాలుల వల్ల వరిపంట నేలకు వాలిపోయి, గింజలు రాలిపోయి రైతాంగానికి తీవ్రంగా నష్టం వాటిల్లుతుందన్నారు. వర్షపు వరదనీటి వల్ల చేతికి వచ్చిన పంట నేలపాలయ్యిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయ అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో పర్యటించి జరిగిన నష్టాన్ని అంచనా వేసి పూర్తిస్థాయిలో రైతాంగానికి నష్టపరిహారం చెల్లించేలా ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలని బాలరాజ్‌గౌడ్ డిమాండ్ చేశారు.

శివుడికి విశేష పూజలు

నల్లకుంట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీక మాసోత్సవాల్లో భాగంగా నల్లకుంట డివిజన్‌లోని న్యూనల్లకుంటలోని సీతారామాంజనేయ సరస్వతి ఆలయ ప్రాంగణంలోని పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ సందర్భంగా గురువారం ఆలయ అర్చక స్వామి జ్ఞానేశ్వర్ శివుడికి ప్రత్యేక అభిషేకం చేశారు. అనంతరం రామలింగేశ్వరస్వామిని పూలమాలలతో అలంకరించి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో మహిళలచే లక్ష గాజుల పూజ చేసి ముత్తైదువులకు పంపిణీ చేశారు. భక్తులకు తీర్థప్రసాద వితరణ చేశారు.

బీసీ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నర్సయ్య, శ్రీనివాస్, రవీందర్

చిక్కడపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తెలంగాణ జనసమితి ఆధ్వర్యంలో నవంబరు 1న బీసీ సదస్సు ఏర్పాటు చేస్తున్నట్లు ఆ పార్టీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ఎం. నరసయ్య తెలిపారు. ముషీరాబాద్ తెలంగాణ జనసమితి కన్వీనర్ మెరుగు శ్రీనివాస్‌యాదవ్ ఆధ్వర్యంలో గురువారం గాంధీనగర్ డివిజన్‌లో బీసీ సదస్సు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా నరసయ్య మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లను రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి పార్లమెంటులో చట్ట సవరణ చేయాలని డిమాండ్ చేశారు. 42శాతం రిజర్వేషన్ల అమలు సాధనకై తెలంగాణ జనసమితి నవంబరు 1న బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ సదస్సు ఏర్పాటు చేసిందని ఆయన వెల్లడించారు. ఈ సదస్సుకు ముషీరాబాద్ నియోజకవర్గంలోని బీసీ సోదరులందరూ హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో గాంధీనగర్ డివిజన్ జనసమితి అధ్యక్షుడు గుండెల్లి రవీందర్‌యాదవ్, నగర ఉపాధ్యక్షుడు పురిరెడ్డి జయపాల్‌రెడ్డి, నాయకులు గడ్డం శంకర్, సత్యనారాయణ, కృష్ణ, మహేష్ పాల్గొన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

నల్లకుంట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బీసీ విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో 42శాతం బీసీ రిజర్వేషన్ల సాధన కోసం బీసీ విద్యార్థి దీక్షకు మద్దతుగా గురువారం విద్యానగర్‌లోని బీసీ హాస్టల్‌లో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి బీసీ విద్యార్థి జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు చేరాల వంశీ, అధికార ప్రతినిధి నూకల మధుయాదవ్ తదితరులు భోజనం చేశారు. అనంతరం వారు పోస్టర్ ఆవిష్కరించారు.

పైప్‌లైన్ పనులు పూర్తిచేయాలి : పద్మావెంకట్‌రెడ్డి


కాలువ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రీతి

రాంనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బాగ్ అంబర్‌పేట డివిజన్‌లోని వైభవ్‌నగర్, నందనవనం నుంచి తిలక్‌నగర్ క్రాస్ రోడ్స్ వరకు వర్షపునీటి పైప్‌లైన్ పనులు పూర్తి చేయాలని కార్పొరేటర్ బి.పద్మావెంకట్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ అధికారులకు సూచించారు. గురువారం జీహెచ్‌ఎంసీ ఏఈ ప్రీతి, వర్క్ ఇన్‌స్పెక్టర్ రవి, స్థానిక ప్రజలతో కలిసి ఆమె నందనవనం కాలనీ, వైభవ్‌నగర్‌లో పర్యటించారు. వరద నీటి పనుల విషయమై ఆమె అధికారులను అడిగి తెలుసుకున్నారు. వరద నీరు కాలనీలు, బస్తీలలోకి వెళ్లకుండా ఈ పనులను వెంటనే పూర్తి చేయాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అప్రోచ్ రోడ్డును ఏర్పాటు చేయాలి

- ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్


ఎర్విన్ రోడ్డు పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

రాంనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గంలోని చేనెంబర్‌లో నిర్మించిన ఫ్లైఓవర్ నిర్మాణం సేవల్లోకి గోల్నాక వద్ద ఫ్లైఓవర్ ముగిసే సమీపంలో ప్రజల సౌకర్యార్థం అప్రోచ్ రోడ్‌ను ఏర్పాటు చేయాలని జీహెచ్‌ఎంసీ అధికారులకు ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సూచించారు. గురువారం జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ ఇంజనీరింగ్ విభాగం డీఈలు ప్రవీణ్, ప్రశాంతి, వర్క్ఇన్‌స్పెక్టర్లు రవి, దుర్గాసిబ్బందితో కలిసి ఎమ్మెల్యే చేనెంబర్ నుంచి గోల్నాక ప్రాంతాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సేవలకు ఫ్లైఓవర్ ఆధారిటీ అధికారులు అప్రోచ్ రోడ్డు నిర్మించకపోవడంతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. జీహెచ్‌ఎంసీ అధికారులు అప్రోచ్ రోడ్డు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి కమిషనర్‌కు పంపించాలని సూచించారు. డీడీ కాలనీలోని వీడీసీ సాయిబాబా ఆలయం వద్ద డ్రైనేజీ సమస్య పరిష్కారానికి బాక్స్ డ్రెయిన్ ఏర్పాటు చేయాలని సూచించారు. నియోజకవర్గంలో రోడ్ల ఆధునికీకరణ, నూతన రోడ్ల నిర్మాణం, పుట్‌పాత్‌ల ఆధునికీకరణకు ఇంజనీరింగ్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. వర్షాల సేవల్లోలో దెబ్బతిన్న రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టి ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు సంతోష్, లింగారావు తదితరులు పాల్గొన్నారు.

మాలమహానాడు తెలంగాణ జిల్లాల ఇన్‌చార్జిల నియామకం


తెలంగాణ జిల్లాల ఇన్‌చార్జిలను ప్రకటిస్తున్న మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు సుధాకర్

కవాడిగూడ, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జాతీయ మాలమహానాడు జిల్లాల ఇన్‌చార్జిలను రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ ప్రకటించారు. గురువారం దోమలగూడలోని రాష్ట్ర కార్యాలయంలో విలేకరుల సమావేశంలో సుధాకర్ మాట్లాడుతూ జాతీయ మాలమహానాడు వ్యవస్థాపకుడు ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ సూచనల మేరకు తెలంగాణలోని 33 జిల్లాలకు ఇన్‌చార్జిలను ప్రకటించినట్లు తెలిపారు. హైదరాబాద్, సిద్దిపేట, మంచిర్యాల జిల్లాలకు బైరి రమేష్, రంగారెడ్డి, మేడ్చల్, యాదాద్రి జిల్లాలకు చిప్పల నరసింహారావు, నల్గొండ, సూర్యాపేట, ఖమ్మం జిల్లాలకు ఎ భాస్కర్, నిర్మల్, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు ఎస్ పుట్టపాకుల, సిరిసిల్ల జిల్లాలకు వెంకటస్వామి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట జిల్లాలకు బ్యాగరి వెంకటస్వామి, గద్వాల జిల్లాలకు తుమ్మల రవికుమార్, మెదక్, కామారెడ్డి జిల్లాలకు ఆర్ శ్రీరాములు, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాలకు దిబ్బేముల సమ్మయ్య, వికారాబాద్, సంగారెడ్డి జిల్లాలకు అనంతరాములు, హనుమకొండ, కరీంనగర్ జిల్లాలకు వెన్నరాజు, జనగాంకు బట్టి సత్యనారాయణ, వరంగల్‌కు జెల్ల ప్రభాకర్, భూపాలపల్లి, ములుగు జిల్లాలకు నీరటి రాములు, నిజామాబాద్‌కు రాంచందర్, కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలకు టి సుధాకర్, ఆదిలాబాద్‌కు బందెల బెంజమిన్‌లను ఇన్‌చార్జిలుగా నియమించినట్లు ఆయన తెలిపారు. మాలల హక్కులు, మాల సామాజికవర్గంపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి శక్తివంచన లేకుండా కృషిచేయాలని నూతన ఇన్‌చార్జిలను ఆయన పిలుపునిచ్చారు.

నేడు డయల్ యువర్ డీఎం

రాంనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ముషీరాబాద్ ఆర్టీసీ డిపో పరిధిలో ప్రాంతాల్లో నివసించే ప్రజలు, ప్రయాణికుల సమస్యలు తెలుసుకోవడం కోసం ఈనెల 31న మధ్యాహ్నం 3నుంచి 4గంటల వరకు డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ టి.రామ్ తెలిపారు. ముషీరాబాద్ డిపో ద్వారా అందిస్తున్న బస్సు సర్వీసుల సేవలకు సంబంధించిన వివిధ అంశాలు, ఫిర్యాదులు డయల్ యువర్ డీఎం కార్యక్రమంద్వారా 9885423042 ఫోన్ నెంబర్‌లో తెలియజేయాలని కోరారు.

నేడు డయల్ యువర్ ఆఫీసర్

బర్కత్‌పుర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడానికి వారి నుంచి తగు సూచనలు సలహాలు తీసుకోవడానికి ఈనెల 31న ఆర్టీసీ డయల్ యువర్ ఆఫీసర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు హైదరాబాద్ రీజియన్ ఆర్‌ఎం సుధా పరిమళ తెలిపారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించడమే ఆర్టీసీ లక్ష్యం అని ఆమె పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు డయల్ యువర్ ఆఫీసర్ కార్యక్రమం కొనసాగుతుందని, ప్రయాణికులు తమ సలహాలు, సూచనలను అందించవచ్చునని ఆమె తెలిపారు. రీజియన్ పరిధిలో ఉన్న 12 ఆర్టీసీ డిపోలలో కూడా డయల్ యువర్ డిపో కార్యక్రమం జరుగుతుందని ఆమె తెలిపారు. ప్రయాణికులు 8885719194 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చునని ఆమె తెలిపారు.

కాంగ్రెస్ షేక్‌పేట డివిజన్ సేవాదళ్ ఇన్‌చార్జిగా సురేష్

రాంనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ షేక్‌పేట డివిజన్ సేవాదళ్ ఇన్‌చార్జిగా సికింద్రాబాద్ జిల్లా పార్టీ సేవాదళ్ అధ్యక్షుడు కరణం సురేష్ నియమితులయ్యారు. ఆయన నియామకాన్ని పార్టీ సేవాదళ్ రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్ ప్రకటించారు. ఈ సందర్భంగా గురువారం అడిక్‌మెట్‌లోని తన కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ పార్టీ సేవాదళ్ పటిష్టత కోసం అంకితభావంతో పనిచేస్తున్న తనను జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో షేక్‌పేట డివిజన్‌కు సేవాదళ్ తరఫున ఇన్‌చార్జిగా నియమించినందుకు రాష్ట్ర అధ్యక్షుడు మిద్దెల జితేందర్, రాజ్యసభ సభ్యుడు ఎం.అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. జూబ్లీహిల్స్‌లో పార్టీ అభ్యర్థి నవీన్‌యాదవ్ గెలుపు కోసం సేవాదళ్ కృషి చేస్తుందన్నారు. నవీన్‌యాదవ్ విజయం కోసం ఇంటింటి ప్రచారం చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.


బర్కత్‌పుర భూమన్నగల్లీ సూర్యభగవాన్ ఆలయం లేన్‌లో డ్రైనేజీ పైప్‌లైన్ మరమ్మతు పనులను పరిశీలిస్తున్న కాచిగూడ కార్పొరేటర్ కన్నె ఉమాదేవి, బీజేపీ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షుడు కన్నె రమేష్‌యాదవ్, నాయకులు సుభాష్‌చందర్, శ్రీసాగర్, అరవింద్, జ్ఞానేశ్వర్, భీమ్‌రావు, ఆర్ సంతోష్, ఓంప్రకాష్, రవియాదవ్ తదితరులు - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి

మాలమహానాడు మహిళా విభాగం ఇన్‌చార్జిగా నవీన


నవీనకు నియామకపత్రం అందజేస్తున్న జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ

నల్లకుంట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మాలమహానాడు గ్రేటర్ హైదరాబాద్ ఇన్‌చార్జిగా బి.నవీన నియమితులయ్యారు. ఈ మేరకు మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణ గురువారం మాలమహానాడు గ్రేటర్ హైదరాబాద్ మహిళా విభాగం ఇన్‌చార్జిగా బి.నవీనను ప్రకటించి ఆమెకు గురువారం నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాలల హక్కుల సాధన కోసం రాజీలేని పోరాటం చేస్తున్నామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలకు వ్యతిరేకంగా చేపట్టిన విధానాలను ఎండగడుతూ జాతి కోసం అహర్నిశలు ఉద్యమిస్తామన్నారు. గ్రేటర్ హైదరాబాద్‌లో మాలమహానాడు పటిష్టత కోసం పూర్తిస్థాయి కమిటీలను పూర్తి చేస్తున్నట్లు పేర్కొన్నారు. తద్వారా గ్రేటర్‌లో మాల మహానాడు బలోపేతం కోసం కృషి చేయాలని మాలజేజులకు సూచించారు. అనంతరం బి.నవీన మాట్లాడుతూ గ్రేటర్ హైదరాబాద్‌లో మాల మహానాడు మహిళా విభాగం బలోపేతం చేయడానికి అంకితభావంతో పనిచేస్తామన్నారు. తనకు పదవి కల్పించిన మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ పబ్బతి శ్రీకృష్ణకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు ఎల్.గిరిజాశంకర్, నంగం సురేష్‌బాబు, కె.వి.సురేష్, ఎ.ఎన్.వినయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు విడుదల చేయాలని

నవంబర్ 4న కలెక్టర్ కార్యాలయాల ముట్టడి

- బీసీ విద్యార్థి సంఘం

రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ


మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు రామకృష్ణ

బర్కత్‌పుర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు రూ.8వేల 500 కోట్లను విడుదల చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆరోపించారు. తక్షణమే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 4న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయాలను ముట్టడిస్తున్నట్లు ఆయన తెలిపారు. గురువారం బర్కత్‌పురలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మూసీ సుందరీకరణపై రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న శ్రద్ధ విద్యార్థుల భవిష్యత్తుపై లేదని ఆరోపించారు. 4న రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జిల్లా కలెక్టర్ కార్యాలయాల ఎదుట నిరసన తెలిపి వినతి పత్రాలు అందజేస్తామని ఆయన చెప్పారు. ప్రభుత్వ భూములు వేలం వేయవద్దని ఆ స్థలాల్లో సంక్షేమ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మించాలని ఆయన డిమాండ్ చేశారు. నాయకులు రాహుల్, వినయ్, నవీన్, అజయ్, వేణు, అర్జున్ పాల్గొన్నారు.

కార్తీకమాస వైశిష్ట్యం గొప్పది : ప్రవచనకర్త భార్గవి

చిక్కడపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కార్తీకమాస వైశిష్ట్యం ఎంతో గొప్పదని ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచనకర్త, జ్యోతిష్య శాస్త్రవేత్త భార్గవి అన్నారు. చిక్కడపల్లి వివేక్‌నగర్ శ్రీ అంజనేయ స్వామి ఆలయంలో జరుగుతున్న కార్తీకమాస ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం కార్తీక మాస వైశిష్ట్యం అంశంపై భార్గవి ప్రవచన కార్యక్రమం జరిగింది. ఈసందర్భంగా భార్గవి మాట్లాడుతూ ఈ మాసంలో సాత్వికాహారం తీసుకోవాలన్నారు. ఈ మాసంలో శివుడిని పూజించడం వల్ల సకల శుభాలు కలుగుతాయన్నారు. కార్తీకమాసంలో భక్తులు శివాలయాలకు వెళ్లి పూజల్లో పాల్గొనాలని ఆధ్యాత్మిక చింతనతోపాటు మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు. ఏకాదశి ఉపవాసం ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందన్నారు. ఆమెను ఆలయ కమిటీ సభ్యులు కొమరవోలు పద్మావతి సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ ఈవో మాచెర్ల దేవానంద తదితరులు పాల్గొన్నారు.

'నిరుద్యోగ జేఏసీ అభ్యర్థి అస్మను గెలిపించాలి'


జూబ్లీహిల్స్ ఇండిపెండెంట్ అభ్యర్థి అస్మ ఎన్నికల ప్రచారంలో నిరుద్యోగ విద్యార్థులు

చిక్కడపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ జేఏసీ నేత, జూబ్లీహిల్స్ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థి అస్మను గెలిపించాలని కోరుతూ నిరుద్యోగ విద్యార్థులు గురువారం నియోజకవర్గంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా అభ్యర్థి అస్మ ఓటర్లతో తమ ఎన్నికల ప్రచారంలో భాగంగా మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్లు వేయకుండా నిరసనగా జూబ్లీహిల్స్ ఎన్నికల బరిలో నిలిచిన తనకు మద్దతుగా ఓటు వేసి ఎన్నికల ప్రచారం చేస్తున్నారని వివరించారు. ఈసందర్భంగా అభ్యర్థి అస్మతో పాటు నిరుద్యోగ జేఏసీ నేతలు, నిరుద్యోగ విద్యార్థులతో కలిసి ప్రచారంలో పాల్గొని గడపగడపకు తిరుగుతూ తనకు కేటాయించిన సీరియల్ 33లో టార్చిలైట్ గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. తనను గెలిపిస్తే అసెంబ్లీలో నిరుద్యోగుల ప్రజా సమస్యలపై ప్రభుత్వంపై పోరాడతానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నిరుద్యోగ జేఏసీ నేతలు శంకర్‌నాయక్, ఇంద్ర, కయ్య వెంకటేష్, నవీన్‌పట్నాయక్, శంబు, సంపత్, రమేష్, గణేష్, మధు, కుమార్, శ్రీనివాస్, రాజేష్, నరేష్, శ్రీకాంత్, అనిల్, బాలకోటి తదితరులు పాల్గొన్నారు.

బాహుబలి రీ రిలీజ్‌తో ప్రభాస్ అభిమానుల సంబరాలు


సంబరాలు జరుపుకుంటున్న ప్రభాస్ అభిమానులు

చిక్కడపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్ నటించిన బ్లాక్‌బస్టర్ చిత్రం బాహుబలి మళ్లీ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ చిత్రం గురువారం సాయంత్రం రెండో ప్రదర్శన (సెకండ్‌షో)గా ఆర్టీసీ క్రాస్‌రోడ్ లోని ప్రముఖ సినిమా థియేటర్ సుదర్శన్ 35ఎంఎంలో రీ రిలీజ్ అయ్యింది. ఈ సందర్భంగా ప్రభాస్ అభిమానుల్లో ఆనందం నెలకొంది. ఆల్‌ఇండియా ప్రభాస్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఏపీ గోవింద్ ఆధ్వర్యంలో అభిమానులు భారీ ఏర్పాట్లు చేశారు. థియేటర్ ఎదుట ప్రభాస్ భారీ కటౌట్ ఏర్పాటు చేసి బెంగళూరు నుంచి ప్రత్యేకంగా తెప్పించిన 1500 కిలోల పూలతో అలంకరించిన పూలదండలు వేసి సంబరాలు జరుపుకున్నారు. రీ రిలీజ్ సందర్భంగా థియేటర్ పరిసరాలను పండుగ వాతావరణంగా మార్చేశారు. కొందరు అభిమానులు ప్రభాస్ పోస్టర్లు, బ్యానర్లు ప్రదర్శించగా మరికొందరు సోషల్ మీడియాలో ప్రత్యేక హ్యాష్ ట్యాగ్‌లతో ఆనందాన్ని వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిటీ ప్రభాస్ ఫ్యాన్స్ ప్రెసిడెంట్ చక్రం ప్రభాస్, హనుమంత్, అర్జున్, సల్మాన్, రామ్, రాజ్, శివ, సుధీర్, కౌశిక్, సోహెల్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పి.సాయిబాబా

జూబ్లీహిల్స్‌లో రాజకీయ లబ్ధి కోసమే అజారుద్దీన్‌కు మంత్రి పదవి : సాయిబాబా

రాంనగర్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో రాజకీయ లబ్ధికోసమే అజారుద్దీన్‌కు మంత్రి పదవి ఇస్తున్నారని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. గురువారం టీడీపీ నగర కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జూబ్లీహిల్స్‌లో ఉన్న మైనారిటీ ఓట్లను కాంగ్రెస్ పార్టీకి వేయించుకునేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల ముందు మైనారిటీ కోటాలో అతనికి మంత్రి పదవి ఇస్తున్నారని పేర్కొన్నారు. శాసనసభ ఎన్నికల్లో, ఉప ఎన్నికల్లో అజారుద్దీన్ పోటీ చేయడానికి పనికిరాడని గుర్తించి గవర్నర్ కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వడంతో పలువురు విమర్శించారు. కాంగ్రెస్ పార్టీకి జూబ్లీహిల్స్‌లో ప్రజాబలం లేదని ఈ మంత్రి పదవి ద్వారా స్పష్టమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నల్లెల కిషోర్, పి.బాలరాజ్‌గౌడ్, భానుప్రకాష్, సత్యనారాయణ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

చిక్కడపల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బాలల దినోత్సవాన్ని పురస్కరించుకుని శిఖరం ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో బాలకళా ఉత్సవ్ మ్యూజిక్, డ్యాన్స్ ఫెస్టివల్‌ను నవంబరు 13న త్యాగరాయగానసభలో నిర్వహించనున్నట్లు ఆ సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి జి. కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా బాలికలకు బాలలు, బాలుర బాలకళాప్రదర్శకులకు ప్రదానం చేయనున్నామన్నారు. సంగీతం, నాట్యం, చిత్రలేఖనం, మిమిక్రీ, ఇంద్రజాలం, క్రీడా, సినీ, టీవీరంగాల్లో రాణిస్తున్న చిన్నారులు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. 4 సంవత్సరాల నుంచి 15 సంవత్సరాలలోపు వయస్సు గల బాలబాలికలు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఆసక్తి గల వారు నవంబరు 5వ తేదీలోగా దరఖాస్తు చేసి రిజిస్టర్ చేసుకోవచ్చునని మరిన్ని వివరాలకు జి. కృష్ణ 9494523562 మొబైల్ నెంబర్‌ద్వారా సంప్రదించవచ్చునన్నారు.


జూబ్లీహిల్స్ ఎన్నికల ఉపఎన్నికల ప్రచారంలో భాగంగా బీజేపీ అభ్యర్థి లంకల దీపక్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించిన ఆ పార్టీ అంబర్‌పేట డివిజన్ నాయకులు దొాజు నాగభూషణంచారి, మైలారం రాజు, నరేష్‌గౌడ్, వెంకటస్వామి గౌడ్, భాస్కర్‌గౌడ్, యాదగిరి - అంబర్‌పేట, ఆంధ్రజ్యోతి


నల్లకుంట శంకర మఠంలో గురువారం శృంగేరి పీఠాధిపతి విధుశేఖరభారతీస్వామి ఆశీర్వాదం పొందిన ప్రముఖ న్యాయవాది నారపరాజు అవినేష్, ఆస్ట్రేలియాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అమృత, నిశ్చల, బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యురాలు కె. గీతామూర్తి తదితరులు - బర్కత్‌పుర, ఆంధ్రజ్యోతి


కళావిపంచి, యువకళావాహిని ఆధ్వర్యంలో గురువారం గుంటూరులో జరిగిన సాంస్కృతిక కార్యక్రమంలో కళాసేవా కార్యక్రమాలు వివిధగా నిర్వహిస్తున్న కన్వీనర్ సంస్థ ప్రతినిధి కన్వీనర్ రాధాకృష్ణను సన్మానిస్తున్న ఆంధ్రప్రదేశ్ నాటక అభివృద్ధి సంస్థ చైర్మన్, ప్రముఖ నటులు గుమ్మడి గోపాలకృష్ణ, నటుడు బొప్పన నరసింహారావు - చిక్కడపల్లి, ఆంధ్రజ్యోతి


పప్పాజీ దాబాలో స్వల్ప అగ్నిప్రమాదం

నల్లకుంట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శివం రోడ్డులోని పప్పాజీ దాబాలో గురువారం రాత్రి షార్ట్‌సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం జరిగింది. ఈ సంఘటన చూసిన స్థానికుల సమాచారంతో అగ్నిమాపక వాహనంతో సిబ్బంది అగ్నిప్రమాద మంటలను ఆర్పివేశారు. దీంతో పెనుప్రమాదం తప్పింది. అగ్నిప్రమాదంలో స్వల్పంగా ఆస్తినష్టం జరిగింది.

ఉరేసుకొని యువకుడి ఆత్మహత్య


బర్కత్‌పుర, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మద్యానికి బానిసైన ఓ యువకుడు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన కాచిగూడ పీఎస్ పరిధిలో జరిగింది. ఎస్ఐ భరత్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. గోల్నాక వినాయకనగర్‌లో నివాసముంటున్న శ్యాంరావు కుమారుడు మహేష్ బాబు(17) బ్యాండ్ మేళంలో పనిచేస్తున్నాడు. మద్యానికి బానిస అయ్యాడు. జీవితంపై విరక్తి చెందిన మహేష్‌బాబు బుధవారం రాత్రి ఇంట్లో ఎవరులేని సమయంలో గదిలో రాడ్డుకు బెడ్‌షీట్‌తో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్దిసేపటి తర్వాత ఇంటికి వచ్చిన తల్లి రాజేశ్ కుమారుడు వేలాడుతూ కనిపించాడు. కాచిగూడ పోలీసులకు సమాచారం అందించింది. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ భరత్‌కుమార్ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతి


గుర్తు తెలియని మహిళ మృతదేహం

బర్కత్‌పుర : పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొని గుర్తుతెలియని మహిళ మృతిచెందింది. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. యాకత్‌పుర - డబీర్‌పుర రైల్వేస్టేషన్ల మధ్య గురువారం 60ఏళ్ల గుర్తుతెలియని మహిళ పట్టాలు దాటుతుండగా రైలు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందింది. మృతురాలిని గుర్తుపట్టేవారు కాచిగూడ రైల్వే పోలీసులను సంప్రదించాలని ఆయన కోరారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


శంకర్

చిక్కడపల్లి : గడ్డం చేయించుకుంటానని బార్బర్ షాప్‌కు వెళ్లిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. చిక్కడపల్లి ఎస్ఐ శివప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. బాగ్‌లింగంపల్లి ఈడబ్ల్యూఎస్ క్వార్టర్స్‌కు చెందిన వై. శంకర్(55) మంగళవారం ఉదయం 6గంటల సమయంలో గడ్డం చేయించుకుంటానని చెప్పి ఇంట్లోనుంచి వెళ్లిపోయి కనిపించకుండా పోయాడు. అతని కోసం వెతికినా ఆయన ఆచూకీ లభించకపోవడంతో బుధవారం రాత్రి చిక్కడపల్లి పోలీసులకు అతని సోదరుడు అంజయ్య ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.